సాక్షి
వరంగల్
శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



తేరుకోని మానుకోట

ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని పంట భూములు ఇసుక, రాళ్లతో నిండిపోగా.. ఇళ్లలోకి బురద చేరింది. బాధితులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. - 10లో▸



స్థిరమైన బయోటెక్నాలజీలో భారత్ అగ్రగామి - 10లో▸

స్థిరమైన బయోటెక్నాలజీలో దేశం అగ్రగామిగా ఉందని సైంటిస్ట్ సుబ్బారెడ్డి అన్నారు.



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మందపల్లిలో కార్డన్ సెర్చ్

45 బైక్‌లు స్వాధీనం



దుగ్గొండి: మండలంలోని మందపల్లి గ్రామంలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 45 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పల్లెల్లో ప్రశాంత వాతావరణం కల్పించడానికి కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు నీలోజు వెంకటేశ్వర్లు, రఘుపతి, 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం వరద బాధితులకు సాయం

గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, నిర్మల బుక్ బైండింగ్ వర్క్స్ యజమాని అల్లం బాలిరెడ్డి ఖమ్మంలో వరద బాధితులకు సహాయం అందించడానికి ముందుకొచ్చారు. శుక్రవారం వరద ప్రాంతాల్లో నివాసం ఉంటున్న విద్యార్థుల కోసం రూ. 50 వేల విలువైన నోట్ బుక్‌లను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు అందించినట్లు బాలిరెడ్డి తెలిపారు. 06పీఆర్‌కేఎల్201: నోట్ పుస్తకాలను తీసుకెళ్తున్న వాహనం ఎదుట బాలిరెడ్డి

రాష్ట్ర స్థాయి 'ఉత్తములకు' అభినందన



వరంగల్: వరంగల్ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాళ్లుగా, అధ్యాపకులుగా ఎంపికై అవార్డులు అందుకున్న వారిని డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్ శుక్రవారం అభినందించారు. డీఐఈఓ కార్యాలయంలో ముగ్గురు రాష్ట్రస్థాయి అవార్డుల గ్రహీతలు నర్సంపేట, వర్ధన్నపేట జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పి.సంపత్ కుమార్, జి.వెంకటయ్య, నర్సంపేట జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్ కొమురారెడ్డిని శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఇంటర్ విద్యా కార్యాలయ సిబ్బంది శేఖర్, సందీప్, రజిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి: డీఈఓ

వరంగల్: న్యాస్‌లో మెరుగైన ఫలితాలు సాధించి వరంగల్ జిల్లాను ముందంజలో ఉంచాలని డీఈఓ ఎం.జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలలో అధికారులతో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రాథమిక తరగతుల్లో ఎఫ్ఎల్ఎన్, ఉన్నత తరగతుల్లో ఎల్ఐపీ కార్యక్రమాలను పటిష్టంగా అమలుపరుస్తూ విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంపొందించాలని సూచించారు. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధను కనబరుస్తూ బోధన అభ్యసన ప్రక్రియలు నిర్వహించాలన్నారు. నవంబర్ 19న నిర్వహించే జాతీయస్థాయి న్యాస్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీలో వచ్చిన మార్పులను రిసోర్స్ పర్సన్ చలమల్ల నాగేశ్వరరావు, ఏవీఆర్ చార్యులు పాల్గొని వివరించారు. కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ, సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై బీఆర్ఎస్ న్యాయ పోరాటం: పెద్ది

నర్సంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీగా అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. అవకతవకలపై ఆయన న్యాయ పోరాటానికి దిగారు. సివిల్ సప్లైలో జరిగిన 1,100 కోట్ల అక్రమాలపై బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి పక్కా ఆధారాలతో ఇటీవల హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తున్న బిడ్డర్ల కాల పరిమితి పొడిగించడం చూస్తుంటే.. ప్రభుత్వమే అక్రమాలకు లైసెన్స్ ఇచ్చినట్లు తెలుస్తోందని పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. టెండర్ విలువకంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోందని పిల్ నంబర్ 34/24ద్వారా దాఖలు చేసినట్లు తెలిపారు. ఒక టన్నుకు 2,230 అదనంగా ఏజెన్సీలు వసూలు చేశాయని పేర్కొన్నారు. 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం టెండర్ పద్ధతిలో నాలుగు ఏజెన్సీలకు కట్టబెట్టిందన్నారు. ధాన్యం ఎత్తకుండానే మిల్లర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి త్వరలోనే బయట పడుతుందన్నారు.

విభిన్న రూపాల్లో వినాయకుడు

కళాకారులు విభిన్న రూపాల్లో వినాయకుడిని తయారు చేస్తున్నారు. ఒకరు సుద్దముక్కలపై గణేశుడి రూపాన్ని చెక్కితే మరొకరేమో పప్పు దినుసులతో రూపొందిస్తున్నారు. ఇంకొకరేమో పచ్చపిండితో పర్యావరణ హిత గణపతిని తయారు చేస్తున్నారు. ఇలా కళాకారుల చేతిలో గణేశుడి రూపం మారుతున్నా 'మట్టి గణపతిని పూజించండి. పర్యావరణాన్ని రక్షించండి' అని వారి చైతన్యం కల్పిస్తున్నారు.

పిండితో పర్యావరణ గణపతి



నర్సంపేట: పట్టణానికి చెందిన జాతీయ అవార్డు గ్రహీత మైక్రో ఆర్టిస్ట్ శ్రీరామోజు జయకుమార్ వినాయక చవితిని పురస్కరించుకుని పిండితో పర్యావరణ గణపతిని తయారు చేశారు. అర ఇంచుకన్నా.. తక్కువ పరిమాణంలో చెట్టును పట్టుకున్నట్లుగా తీర్చిదిద్దాడు. ఈసందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజిస్తూ చెట్లను కాపాడాలన్నారు. పర్యావరణాన్ని మనం పరిరక్షిస్తే పర్యావరణం మనల్ని రక్షిస్తుందని తెలిపారు.



పిండితో తయారు చేసిన సూక్ష్మ గణపతి

పప్పు దినుసులతో..



నర్సంపేట: పచ్చదనాన్ని, పర్యావరణాన్ని పెంపొందించాలనే సందేశాన్నిస్తూ.. పప్పు దినుసులతో వినాయకుడిని రూపొందించాడు పట్టణానికి చెందిన నాలుగో తరగతి చదువుతున్న వివేక్. భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే వినాయకచవితి పండుగలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణహితంగా ఉత్సవాన్ని నిర్వహించాలని వివేక్ కోరుతున్నాడు.



పప్పు దినుసులతో గణేషుడు

చాక్‌పీస్‌లపై చక్కని రూపం..



చెన్నారావుపేట: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మైక్రో ఆర్టిస్ట్ కాచవరపు సంధ్య చాక్‌పీస్‌లపై వినాయ ప్రతిమలను చిత్రీకరించారు. నవరాత్రి ఉత్సవాల్లో మట్టి వినాయకులనే వాడాలనే సందేశమిస్తూ ఈ కళాకృతులను రూపొందించడం అభినందనీయమని సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో సంధ్యను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం అండెం కర్ణాకర్ రెడ్డి, మేడి రమేష్, వల్ల వేణు, కృష్ణమోహన్, రాజు, భద్రు, జున్నుతుల కవిత, స్వప్న, రోజా, దొంతి స్రవంతి, తదితరులు ఉన్నారు.



చాక్‌పీస్‌పై చెక్కిన వినాయకులు



జగన్నాథ రథంపై..

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరంలోని 16వ డివిజన్ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న గణేశుడి విగ్రహం, వేదిక ఆకట్టుకుంటోంది. గతేడాది ఇక్కడ చంద్రయాన్‌కు సంబంధించిన గణేశుడి విగ్రహం, ఏర్పాటు చేసిన సెట్టింగ్ రాష్ట్రవ్యాప్తంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా పూరీ దేవాలయం మోడల్‌లో జగన్నాథ రథ చక్రాలతో ఏర్పాటు చేస్తున్న గణేశుడి విగ్రహం, రథచక్రాలు ఆకట్టుకుంటున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ప్రతీ రోజు ఇక్కడ విశేష పూజలు, పలు రకాల అన్నదానం, తీర్థప్రసాదాలను కాంప్లెక్స్ ప్రతినిధులు అందించడానికి ఏర్పాట్లు చేశారు.



పూరీ జగన్నాథ ఆలయం తరహాలో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్

సరిపడని వాన

- జిల్లాలో తగినంత కురవని వర్షం
- జూన్ నుంచి ఇప్పటివరకు కురవాల్సింది 881.7 మి.మీలు
- ఇప్పటివరకు నమోదైన వర్షపాతం 700.5 మి.మీలు
- 181.2 మి.మీల లోటు ఉందంటున్న వాతావరణ శాఖ



ఖానాపురం మండలం దుంపిల్ల గ్రామ చెరువు పరిధిలో నెర్రెలుబారిన పొలం(ఫైల్)

సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ జిల్లాలో వాన విలయతాండవం సృష్టించింది. దానికి అనుకొని ఉన్న వరంగల్ జిల్లాలో మాత్రం ఒకట్రెండురోజులు భారీ వర్షాలు కురిసినా లోటు వర్షపాతమే కనిపిస్తోంది. ఆగస్టు నెలాఖరులో దంచికొట్టిన వానే ఇప్పటి వరకు ఈ సీజన్‌లో అత్యధిక వర్షపాతంగా ఉందని వాతావరణ విభాగ గణాంకాలు చెబుతున్నాయి. జూన్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 881.7 మిమీల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 700.5 మిమీల సాధారణ వర్షమే కురిసింది. అంటే 181.2 మిమీల లోటు వర్షపాతం ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఆగస్టు 30, ఆగస్టు 31న భారీ వర్షాలతో కాస్త వర్షపాతం పెరిగిందని, లేకుంటే ఇంకా లోటు వర్షపాతం ఎక్కువగా ఉండేదని చెబుతున్నాయి. ఈనెలలోనైనా భారీ వర్షాలు కురిస్తే వాస్తవ వర్షపాతం మించి ఎక్కువగా నమోదవుతుందని, లేదంటే లోటు వర్షపాతమే ఉంటుందని ఆ గణాంకాలు చెబుతున్నాయి.

ఆగస్టులోనే ఎక్కువ వర్షం

జూన్‌లో 188.2 మిమీల వర్షపాతం కురవాల్సి ఉండగా.. 153.9 మిమీలు కురిసింది. 34.3 మిమీల లోటు వర్షపాతం నమోదైంది. జూలైలో 299.2 మిమీలు కురవాల్సి ఉండగా.. 273.3 మిమీలు మాత్రమే కురిసింది. 25.9 మిమీల లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టులో 181.6 మిమీలు కురవాల్సి ఉండగా.. 252.2 మిమీల వర్షపాతం నమోదైంది. 70.6 మిమీల అధికంగా వర్షం కురిసింది.

ఆశించినంత కురవని వానలు

సెప్టెంబర్ నెలలో ఇప్పటివరకు 212.7 మిమీలు కురవాల్సి ఉండగా.. 21.1 మిమీలు మాత్రమే కురిసింది. అంటే 191.6 మిమీల వర్షపాతం ఇంకా నమోదు కావాల్సి ఉంది. మొత్తంగా 881.7 మిమీల వర్షపాతానికి 700.5 మిమీల వర్షం కురిసిందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 30, 31 తేదీల్లో నమోదైన వర్షపాతమే ఈ వానాకాలం సీజన్‌లో అత్యధికమని, ఈ వర్షాలతోనే జిల్లాలోని చెరువులు కాస్తా జలకళను సంతరించుకున్నాయంటున్నారు. 816 చెరువుల్లో సగం వరకు నిండగా, మిగతావి 20 నుంచి 50 శాతం వరకు మాత్రమే నీళ్లు ఉన్నాయని, రాబోయే రోజుల్లో వర్షం కురిస్తేనే ఇవి పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకుంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

మట్టి వినాయకుల్నే పూజించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- మట్టి ప్రతిమల పంపిణీ



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జల్ సంచాయ్.. జన్ భగీధారి వీక్షణ

కేంద్ర ప్రభుత్వంతో నిర్వహించే జలశక్తి నేషనల్ వాటర్ మిషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ రాష్ట్రం సూరత్‌లోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఇండోర్ స్టేడియంలో ప్రదర్శించిన 'జల్ సంచాయ్ జన్ భగీధారి' డాక్యుమెంటరీని కలెక్టర్ సత్యశారద వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

గణేశ్ చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ డాక్టర్ సత్యశారద జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

అనాథ బాలికకు అండగా ఎంపీ కావ్య

వర్ధన్నపేట: తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన బాలికను వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య అక్కున చేర్చుకున్నారు. ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఆ బాలిక బాధ్యతలు మొత్తం ప్రభుత్వం తీసుకునేలా చేయాలని వరంగల్ ఎంపీ కడియం డాక్టర్ కావ్య అధికారులను ఆదేశించి వెంటనే అమలు పర్చారు. వర్ధన్నపేట పట్టణ పరిధి కోనాపురానికి చెందిన ఎలికట్టె భాస్కర్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే తల్లి స్వరూప తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందింది. దీంతో వారి కూతురు అనాథగా మిగిలిపోయింది. ఈసమాచారం అందుకున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య శుక్రవారం కోనాపురానికి చేరుకుని ఐసీడీఎస్ అధికారులను పిలిచారు. ఆమె బాలిక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందజేశారు. బాలికకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలన్నారు. ఐసీడీఎస్ అధికారులతో ఎంపీ మాట్లాడుతూ.. బాలిక బాధ్యతలన్నీ ప్రభుత్వమే తీసుకునేలా చూడాలని, వెంటనే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు.



బాలికను ఎత్తుకున్న ఎంపీ కడియం కావ్య

ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ

వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాను ఈ ఆస్పత్రిలో వైద్య విధులు నిర్వర్తించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వార్డుల్లో తిరుగుతూ రోగుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పర్వతగిరి: సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ సూచించారు. పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎన్.గోపాల్‌రావు, స్థానిక వైద్యాధికారి ఉదయ్‌రాజ్, ఇన్‌చార్జి ఏఎంఓ మాడిశెట్టి శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ యాదయ్య, హెచ్ఈఓ మూసా మహమ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, ఫార్మసిస్ట్ రాజేందర్, పీహెచ్ఎన్ హెచ్‌వీ వసంత తదితరులు పాల్గొన్నారు.



డెంగీ జ్వర బాధితురాలితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

సట్టా నిర్వాహకుల అరెస్ట్

వర్ధన్నపేట: నల్లబెల్లి గ్రామశివారులోని ఊర చెరువు వద్ద రహస్యంగా ఆన్‌లైన్‌లో సట్టా/మట్కా నిర్వహిస్తున్న వ్యక్తులను శుక్రవారం టాస్క్‌ఫోర్స్, వర్ధన్నపేట పోలీసులు శుక్రవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వరంగల్ ఉర్సుగుట్ట కరీమాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్లు ఎండీ యాకూబ్, ఎండీ అన్వర్ పాత నేరస్తులు. పోలీసులకు దొరకొద్దనే ఉద్దేశంతో వర్ధన్నపేట మండలం నల్లబెల్లి శివారు వద్ద ఉన్న ఊర చెరువు సమీపంలో సట్టా/మట్కా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆకస్మికంగా దాడులు చేశారు. నుంచి రూ.33,150, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో వీరిద్దరిపై మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలో చెరో రెండు కేసులు నమోదయ్యాయని తెలిపారు. మోసపూరితమైన ఆటలకు ఆకర్షితులై కష్టపడి సంపాదించుకున్న డబ్బులు పోగొట్టుకోవద్దని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

- జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

దుగ్గొండి: పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తేనే వ్యాధులు రాకుండా ఉంటాయని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి అన్నారు. మండలంలోని నారాయణతండా, తిమ్మంపేట గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. కాలనీల్లో తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి చుట్టూ మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పాత కూలర్లు ఉంటే వాటిలో నీళ్లు నిలిచి దోమలు పెరిగి జ్వరాలు వస్తాయని పేర్కొన్నారు. వాటిలోని నీటిని వెంటలనే తొలగించాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చక్కగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శోభన్‌ను ఆదేశించారు. తిమ్మంపేటలో పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించి పనులు బాగానే ఉన్నాయని ఇంకా బాగా చేయాలని ఇంచార్జీ పంచాయతీ కార్యదర్శి నూనె వేణు ప్రసాద్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ లెక్కల అరుందతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.



నారాయణతండాలో పరిసరాల్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

రాయపర్తి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలు, భోజన గదులను పరిశీలించారు. ఈసందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలో పని చేస్తున్న వంట సిబ్బందికి ఆరోగ్య సర్టిఫికెట్ ఉండాలని లేకుండా చేయడం సరికాదన్నారు. పాఠశాలలో మినపగుళ్లు, కందిపప్పు నాణ్యంగా లేదని వాటి శాంపిళ్లను తీసుకొని ల్యాబ్‌కు పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేయండి

- డీఏఓ అనురాధ

ఖానాపురం: రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణలో వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణ, యాప్‌లో నమోదు, రంగాపురంలో పత్తి, వరి పంటల పరిశీలన, ఎరువుల దుకాణాల తనిఖీతో పాటు ఖానాపురం సహకార సంఘాన్ని తనిఖీ చేసి వివరాలు సేకరించారు. రుణమాఫీ, నూతన రుణాల మంజూరు వివరాలే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ బోగ శ్రీనివాస్, ఏఈఓలు రాజ్‌కుమార్, సొసైటీ సిబ్బంది మేరుగు రాజు, వినయ్, తదితరులున్నారు.



వివరాలు సేకరిస్తున్న డీఏఓ అనురాధ

సాహసం చేసి.. పునరుద్ధరించి

- చెరువులో ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు
- విద్యుత్ సిబ్బందికి పలువురి అభినందనలు

ఖానాపురం: చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ తీగల మరమ్మతులు చేపట్టిన సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మంగళవారిపేట సబ్‌స్టేషన్ నుంచి నాజీతండాకు వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ శుక్రవారం ఉదయం 8 గంటలకు తెగి మంగళవారిపేట శివారులోని చెరువులో పడిపోయింది. చేసేదేం లేక సబ్‌స్టేషన్ ఆపరేటర్ హర్షీ ఉన్నతాధికారులకు తెలిపి విద్యుత్ సరఫరా నిలిపేశారు. వెంటనే ఏఎల్ఎం బషీర్ చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కారు. ఎల్ఐ వజీర్‌పాషా అతడికి సహాయంగా చెరువులో ఈదుకుంటూ వెళ్లి సహకారాన్ని అందించారు. చెరువులో ఉన్న విద్యుత్ వైర్‌కు తాడు కట్టడంతో ఎస్ఎల్ఐ రాజు, గ్రామ హెల్పర్లు సాయిమల్లు, ప్రశాంత్ తాడు లాగి విద్యుత్ తీగలు సరి చేశారు. చెరువులో ఈదుకుంటూ వెళ్లి సాహసం చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన సిబ్బందిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



చెరువులో విద్యుత్ లైన్‌ను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

అక్రమాలపై విచారణ చేపట్టాలని ధర్నా

నర్సంపేట: మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి నిగ్గు తేల్చాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శనగా వచ్చి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ అధికారి నాగరాజుకు అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ..నర్సంపేట అభివృద్ధి కోసం కోట్ల రూపాయల బడ్జెట్ వస్తున్నా.. క్షేత్రస్థాయిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గంలోని కౌన్సిలర్లే అవినీతి జరుగుతోందని పేర్కొనడం.. ప్రజాధనం దుర్వినియోగం అవుతోందనడానికి నిదర్శనమన్నారు. కొద్ది వర్షం పడితేనే కాలనీలు జలమయమవుతున్నాయని, ఈగలు, దోమలతో వ్యాధులు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. దోమలు, ఈగలు, క్రిమి కీటకాలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గ్రీన్ ల్యాండ్స్ రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆ స్థలాల్లో పార్కులు, ఆట స్థలాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, జిల్లా కమిటీ సభ్యులు జన్ను రమేశ్, పట్టణ నాయకులు గజవెల్లి జగపతి, గుజ్జుల శివ, గనిపాక బాబు, గద్దం స్వరూప, కసుబాల సతీశ్, బెజ్జంకి అచల, బండారి లావణ్య, నర్సయ్య, రాజు, పాషా, ఖాజా, దేవమ్మ, ప్రమీల, పేదలు, తదితరులున్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

క్లుప్తంగా

నేటినుంచి బొగత సందర్శన

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతాన్ని శనివారం నుంచి పర్యాటకులు సందర్శించవచ్చని రేంజర్ చంద్ర మౌళి తెలిపారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు బొగత జలపాతం ఉధృతంగా ప్రవహించింది. దీంతో పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సందర్శనను కొన్నిరోజులుగా నిలిపి వేశారు. ప్రస్తుతం వరద ఉధృతి తగ్గడంతో సందర్శనకు జిల్లా అధికారులు అనుమతులను ఇచ్చారు. జలపాతం నీటి లోకి పర్యాటకులు దిగొద్దని బొగత సిబ్బందికి సహకరించాలని రేంజర్ చంద్ర మౌళి కోరారు.

అక్షర చిట్స్ స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల నిలిపివేత?

కాజీపేట అర్బన్ : అక్షర చిట్‌ఫండ్స్, అక్షర గ్రూప్ ఆఫ్ కంపెనీల స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి సుభాషిణి ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గల 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని అక్షర చిట్స్ స్థిరాస్తులకు రిజిస్ట్రేషన్లను చేపట్టకూడదని సబ్ రిజిస్ట్రార్‌లకు ఉత్తర్వులను జారీ చేసి సూచించినట్లు తెలిసింది.

వరంగల్ మార్కెట్‌లో మక్కలకు ఆల్‌టైం రికార్డు ధర

- క్వింటాకు రూ.3,015



వరంగల్ మార్కెట్‌లో మక్కల రాశి

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వస్తున్న మొక్కజొన్నలకు రికార్డు ధరలు నమోదవుతున్నాయి. గత ఏడాది రూ.2,450 క్వింటాల్‌కు గరిష్ఠ ధరలు నమోదు కాగా గత నెల నుంచి రికార్డు ధరలు లభిస్తున్నాయి. శుక్రవారం వరంగల్ మార్కెట్‌కు హనుమకొండ జిల్లా నడికుడ మండలం నర్సక్కపల్లికి చెందిన రైతు సురావు కిషన్‌రావు 116బస్తాల పాత మక్కలు తెచ్చారు. వీటికి హెచ్‌జీఎల్ అడ్తిదారుడు క్వింటాల్‌కు రూ.3,015లు చొప్పున వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్‌కు విక్రయించాడు.

అద్దె బస్సు యజమానులకు బస్‌పాస్ సౌకర్యం

హన్మకొండ: అద్దె బస్సుల యజమానులకు ఆర్టీసీ యాజమాన్యం ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించింది. తమకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ మే మాసంలో వినతిపత్రం సమర్పించారు. స్పందించిన యాజమాన్యం కాంప్లిమెంటరీ బస్ పాస్ సౌకర్యం కల్పిస్తూ ఆర్టీసీ ఈడీ, కార్పొరేషన్ సెక్రటరీ మునిశేఖర్ నోటిఫికేషన్ జారీ చేశారు. నివాస స్థలం నుంచి 35 కిలో మీటర్ల వరకు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించారు. ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఈడీలకు ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బ మధుకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నీ కొడుకును కిడ్నాప్ చేశాం

- ఫోన్ చేసి బెదిరింపు.. డబ్బుల డిమాండ్
- వచ్చిన నంబర్ సిరీస్ పాకిస్తాన్‌దిగా గుర్తింపు



ఫోన్‌చేసిన వ్యక్తి డీపీలోని ఫొటో

హసన్‌పర్తి: 'నీ కొడుకును కిడ్నాప్ చేశాం. డబ్బులు తీసుకు రావాలి' అంటూ ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి బెదిరించాడు. ఫోన్ నంబర్ సిరీస్ పాకిస్తాన్‌దిగా స్థానికులు పేర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్లితే... హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పరిధి ఎర్రగట్టు క్రాస్ రోడ్డుకు చెందిన గండాత్రి రాంబాబుకు వంశీకృష్ణ అనే కుమారుడు ఉన్నాడు. బీటెక్ పూర్తి చేసిన వంశీ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు. శుక్రవారం రాంబాబుకు ఓ వ్యక్తి ఫోన్ +923198294322 నుంచి కాల్ వచ్చింది. 'మీ కొడుకు వంశీకృష్ణను కిడ్నాప్ చేశాం' అంటూ హిందీలో మాట్లాడాడు. డబ్బులు పట్టుకుని రావాలని చెప్పినట్లు రాంబాబు తెలిపాడు. హిందీ రాకపోవడంతో 'కిడ్నాప్... పైసా లావో' అని రెండు పదాలే తనకు అర్థమైనట్లు రాంబాబు చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన రాంబాబు వెంటనే తన కుమారుడికి ఫోన్ చేసి ఎక్కడున్నావని ఆరా తీయగా.. అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నాడు.

ఆర్ట్స్ కళాశాలలో కేయూ రిజిస్ట్రార్ తనిఖీ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని సైన్స్, ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. బోధన, బోధనేతర సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సమయపాలన పాటించనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రిజిస్ట్రార్ వెంట ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్ ఉన్నారు.

తేరుకోని మానుకోట

వరదతాకిడికి సర్వం కోల్పోయిన ప్రజలు

- ఇసుక, రాళ్ల మేటలతో నిండిన పంట భూములు
- రోడ్లు, బ్రిడ్జిలు తెగడంతో నిలిచిన రాకపోకలు
- బురదమయంగా మారిన ఇళ్లు
- ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న బాధితులు

జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో పంటభూములు ఇసుక, రాళ్లతో నిండిపోగా.. ఇళ్లలో బురద చేరింది. నిత్యావసర వస్తువులు, సామగ్రి సైతం లేక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద తగ్గినా.. కన్నీరు మాత్రం తగ్గని ఆ బాధితులు ఆపన్నహస్తం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

- సాక్షి, మహబూబాబాద్



ముల్కలపల్లిలో పంటపొలాల్లో వేసిన ఇసుక మేటలు

ఆపన్న హస్తం కోసం

నెల్లికుదురు మండలం రావిరాల, సీరోలు మండలం ముల్కలపల్లి, మోదుగుగడ్డ తండా, దుబ్బతండా, మరిపెడ మండలంలోని సీతారాం తండా, ఉల్లెపల్లి, బీచురాజుపల్లి, కురవి మండలం నల్లెల్ల, మోదులగూడెం గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చెట్టుకొకరు, పుట్టకొకరు వెళ్లి తలదాచుకున్నారు. అయితే ఇంట్లో ఉన్న బియ్యం తడిసి ముద్దయ్యాయి. దుస్తులు, ఇంట్లో సామగ్రి కొట్టుకుపోయాయి. దీంతో దాతలు ఇచ్చే బియ్యం, వస్తువులు, ఆర్థిక సాయమే ఆధారం అవుతుంది. ఎవరు వస్తారో.. ఏం ఇస్తారో అని ఆపన్నహస్తం కోసం బాధితులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

- స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఆకేరు వాగుపై చిన్నగూడూరు వద్ద నిర్మించిన ఆనకట్ట.. వారం క్రితం వచ్చిన వరదకు తెగిపోయింది. దాని కింద ఉన్న బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు 30 మీటర్ల మేర ఆనవాళ్లు లేకుండా పోయింది. దీంతో నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే ఆ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. చిన్నగూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి మండలాల నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి రావాలంటే 30కిలో మీటర్లకు బదులు 60కిలోమీటర్లు, కొన్నిచోట్ల 100 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. ఈ రోడ్డు నిర్మించేదెప్పుడు రాకపోకలు ముందుకు సాగేదెప్పుడు అని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా ఖమ్మం పట్టణానికి వెళ్లేందుకు సీరోలు మండలం ముల్కలపల్లి గ్రామ పరిధిలో 2009లో నిర్మించిన బ్రిడ్జి శనివారం రాత్రి కురిసిన వర్షం, పైన చెరువులు తెగడంతో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగి పై టాప్ మొత్తం లేచి పడింది. పిల్లర్లు కూడా వంగిపోయాయి. అప్పుడు రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ బ్రిడ్జి ఇప్పుడు నిర్మించాలంటే కనీసం రూ.20 కోట్లైనా ఖర్చు అవుతుంది. ఆ నిధుల మంజూరి, బ్రిడ్జి నిర్మాణం జరిగితే కానీ రాకపోకలు సాగే పరిస్థితిలేదు.
- జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి, దంతాలపల్లి, నర్సింహులపేట, మరిపెడ, కురవి, చిన్నగూడూరు, డోర్నకల్ మండలాల్లో ఎక్కువ, ఇతర మండలాల్లో పలుచోట్ల మొత్తం జిల్లాలో 45 చెరువులు తెగిపోయాయి. 35 చెరువులు దెబ్బతిన్నాయి. అధికారుల ప్రాథమిక లెక్కల ప్రకారం మొత్తం 80 చెరువులు, కుంటల కింద 27,639 ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్లు పేరుకుపోయాయి. మరో లక్ష ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. లక్ష ఎకరాలకు పంటకు సాగు నీరు లేకుండాపోయింది. ఇసుక మేటలు తొలగించాలి. రాళ్లు ఎత్తిపోసుకోవాలంటే కనీసం నెలరోజులైనా పడుతుంది. చెరువు కట్టల మరమ్మతు చేయాలి. మళ్లీ చెరువుల్లోకి నీళ్లు రావాలి.. ఇది జరగాలంటే కనీసం ఏడాది పడుతుంది.
- జిల్లాలోని మరిపెడ మండలం మాదిరిపురం సమీపంలో నిర్మించిన మిషన్ భగీరథ ప్లాంట్ నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తాగునీరు అందుతోంది. వరద బీభత్సంతో చిన్నగూడూరు, ఎల్లంపేట, పురుషోత్తమాయగూడెం, తానంచెర్ల, ఉల్లెపల్లి ఇలా ఐదు చోట్ల ప్రధాన పైపులైన్, మరో 20చోట్లకు పైగా అంతర్గత పైపులైన్ల లింగ్ తెగిపోవడంతోపాటు పలుచోట్ల పైపులు పగిలిపోయాయి. దీంతో ఐదు రోజులుగా జిల్లాలోని 45 గ్రామాలకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. ఒక వైపు వర్షంతో చుట్టూ నీరు ఉన్నా.. తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు.
- ఇలా జిల్లాలోని గ్రామాలు తేరుకోవాలి.. ప్రజలు కోలుకోవాలంటే చాలా రోజులు పడేలా ఉంది. జిల్లాలో తెగిన రోడ్లు, బ్రిడ్జిలకు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు.. కొట్టుకపోయిన పంటలకు పరిహారం అందించడం.. చనిపోయిన పశువులు, గొర్రెలు, మేకలకు పరిహారం, కూలిపోయిని ఇళ్ల పునఃనిర్మాణం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, మహబూబాబాద్ మున్సిపాలిటీలో దెబ్బతిన్న రోడ్ల తాత్కాలిక పనుల కోసం రూ.60 కోట్లకు పైగా అవసరమని అధికారులు అంచనా వేశారు. అయితే తాత్కాలిక పనుల కోసం కూడా ఈ అంచనాలు సరిపోయేలా లేవని.. సుమారు రూ.100కోట్లు విడుదల చేస్తే గానీ పనులు జరిగే అవకాశం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

తడిసిన వడ్లు



సీతారాంతండాలో తడిసిన వడ్లను ఆరబెడుతున్న ఈమె పేరు గుగులోతు స్వరూప. భర్త భీముడు, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇంట్లో ఉన్న 10 బస్తాల ధాన్యం, 5 క్వింటాళ్ల బియ్యం, 50కిలోల జొన్నలు తడిసి ముద్దయ్యాయి. ఇంట్లో సామగ్రి అంత తడిసిపోయి బురద నీరు ఇంట్లోకి వచ్చింది.

బురదలో కూరుకుపోయిన మిరపతోట



పైఫొటోలో కనిపిస్తున్న మహిళా రైతు సీరోలు మండలం దుబ్బగడ్డతండాకు చెందిన దారావత్ శారద. తండా సమీపంలో రెండెకరాల్లో మిరపతోట వేయగా ఆకేరు వరదతో సగం మొక్కలు కొట్టుకుపోగా మిగతా మొక్కలు బురదలో కూరుకుపోయాయి. తోటంతా బురదమయంగా మారడంతో శారద కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

గంజాయి నిందితుల అరెస్టు

- 6.33 కిలోల గంజాయి స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన తొర్రూర్ సీఐ జగదీశ్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ జగదీశ్

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు తొర్రూర్ సీఐ జగదీశ్ తెలిపారు. ఎస్సై చిర్ర రమేశ్‌బాబుతోకలిసి శుక్రవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఒడిసా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా చిందైగూడ గ్రామానికి చెందిన బాబుల మది, రతన్ బడాయిలు సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఒకే సారి పెద్ద మొత్తంలో ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆశతో గంజాయి అక్రమ వ్యాపారానికి పూనుకున్నారు. ఈక్రమంలో మహబూబాబాద్ నుంచి నెల్లికుదురు వైపు శుక్రవారం గంజాయితో వస్తున్నట్లు నమ్మదగిన సమాచారంతో ఎస్సై చిర్ర రమేశ్ బాబు పోలీసు సిబ్బందితో పోలీస్‌స్టేషన్ ఎదుట తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఆటోలో రూ.1,58,250 విలువ చేసే 6.33 కేజీల ఎండు గంజాయి గుర్తించి, ఇద్దరినీ విచారించగా ఒడిశా రాష్ట్రం నుంచి తరలిస్తున్నట్లు తేలింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రమేశ్ బాబు, సిబ్బందిని ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ అభినందించినట్లు తెలిపారు.

షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే సికింద్రాబాద్– షాలిమార్ ఎక్స్‌ప్రెస్(22850)ను అధికారులు శుక్రవారం రీషెడ్యూల్ చేసి నడిపించారు. సికింద్రాబాద్‌లో 8:55 గంటలకు బయలుదేరాల్సిన షాలిమార్ ఎక్స్‌ప్రెస్ 3:55 గంటలకు బయల్దేరిందని, దీంతో కాజీపేట జంక్షన్‌కు నిర్ణీత సమయం చాలా ఆలస్యంగా చేరుకుందని అధికారులు తెలిపారు.

సర్టిఫికెట్ల దందాలో మరొకరి అరెస్టు

రామన్నపేట : వరంగల్ తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో పోలీసులు శుక్రవారం మరొకరిని అరెస్టు చేశారు. మూడు రోజుల క్రితం ఎనిమిది మందిని అదుపులోకి తీసుకోగా.. కాశిబుగ్గకు చెందిన మాన్యం సిద్ధయ్యను శుక్రవారం అరెస్టు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి వెల్లడించారు.



రైతు బతికుండగానే మృతిచెందినట్లు ధ్రువీకరణ



రైతు మల్లయ్యతో కుటుంబ సభ్యులు



క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

- మరో వ్యక్తిపై అక్రమ పట్టా.. అప్పటి తహసీల్దార్ కోమిపై ఫిర్యాదు

పర్వతగిరి: రైతు బతికుండగానే మృతిచెందినట్లు ధ్రువీకరించి మరో వ్యక్తికి అక్రమంగా పట్టా చేసిన ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని వడ్లకొండ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వడ్లకొండ గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లయ్యకు వారసత్వంగా సర్వే నంబర్ 185/7/1లోని ఎకరం 25గుంటల భూమి ఉంది. అతను పట్టాదారు పాస్ పుస్తకం ఐఓ బ్యాంకులో పెట్టి క్రాప్ లోన్ రూ.85వేలు తీసుకున్నాడు. ఇటీవల రుణమాఫీ తనకు రాకపోవడంతో అనుమానం వచ్చి తెలుసుకోగా బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులు భూమి మల్లయ్య పేరు మీద లేదని చెప్పగా అవాకయ్యాడు. దీంతో మల్లయ్య తమ కుమారుడి సాయంతో సమాచార హక్కు చట్టం ద్వారా ఈ భూమి ఎవరి పేరు మీద ఉందని తెలుసుకోగా ఎర్రం దూడయ్య అనే వ్యక్తి పేరు మీద ఉందని, గత ఏడాది మార్చి 13న అప్పటి తహసీల్దార్ కోమి పట్టా చేసినట్లు తేలింది. ఎర్రం మల్లయ్య మృతిచెందినట్లు తహసీల్దార్ ధ్రువీకరించారని, అందుకు సాక్షులుగా ఎర్రం రాజు, వల్లం దాస్ వెంకటేశ్వర్లు, ఎండీ.అక్తర్‌పాషా సంతకాలు పెట్టినట్లు తెలుసుకున్నారు. వెంటనే బాధిత రైతు మల్లయ్య కలెక్టర్, పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ కోమిపై ఫిర్యాదు చేశారు. ఎస్సై బోగం ప్రవీణ్‌ను వివరణ కోరగా విచారణ చేశామని, తహసీల్దార్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ వెంకటస్వామిని వివరణ కోరగా రైతు బతికుండగానే మృతిచెందినట్లు ధ్రువీకరించి మరో వ్యక్తిపై అక్రమంగా పట్టా చేసిన విషయం వాస్తవమేనని, పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని, అందులో భాగంగా ఎర్రం మల్లయ్య భూమిపైకి ఫీల్డ్‌పై వెళ్లామని తెలిపారు. పూర్తిస్థాయి సర్వే జరుగుతుందని, కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎల్కతుర్తి: కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో చోటు చేసుకుంది. వంగర పోలీస్‌స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ప్రకాశ్, ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వంగర గ్రామానికి చెందిన మల్లమారి రవీందర్(52) పిల్లల చదువు, తన ఇంటి అవసరాల నిమిత్తం అప్పులు చేశారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోయి తీర్చలేకపోయాడు. వ్యవసాయం చేయగా వచ్చిన డబ్బులతో అప్పులు తీర్చలేక, కుటుంబాన్ని పోషించలేక వ్యవసాయ బావివద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవీందర్ భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో పురోహితుడు..



మహేశ్ ఉపాధ్యాయ(ఫైల్)

కాశిబుగ్గ: ఆర్థిక ఇబ్బందులతో ఓ పురోహితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి, జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అండర్‌బ్రిడ్జి ముందాడ భవన్ ఆలయంలో మహేశ్ ఉపాధ్యాయ(40) పురోహితుడిగా పనిచేస్తున్నాడు. ఆర్థిక సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం ఉదయం జాన్‌పీరీలు గేటు సమీపంలో అప్‌లైన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మృతుడి సోదరుడు విజయ్‌కుమార్‌కు అప్పగించారు. మహేశ్ ఉపాధ్యాయకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



విమర్శలు కాదు.. పరిహారం అందించాలి

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మహబూబాబాద్ అర్బన్: రాజకీయాలు కాదు, విమర్శలు కాదు వరదతో నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా పరిహారం అందించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ మానుకోట జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, బండి సంజయ్ రాష్ట్రంలో వరదలు వచ్చిన జిల్లాలను పరిశీలిస్తున్నారు. నష్టపోయిన బాధితులకు పరిహారం అందించాలని కేంద్ర హోం శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. జిల్లాలో వరదకు కొట్టుకుపోయిన గ్రామంలో పంటల నష్టాన్ని అంచనా వేయలేదని, కూలిన ఇళ్లు, చనిపోయిన పశుసంపద లెక్క తీయలేదని, వరదలో కొట్టుకుపోయిన, పిడుగు పడి మృతిచెందిన కుటుంబాలకు పరిహారం ప్రకటించారు తప్ప ఒక్క రూపాయి ఇవ్వలేదని, వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విపత్తు నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) రూ.1,360 కోట్లు ఉన్నట్లు లెక్కలు చెప్తున్నాయని, రాష్ట్రం ఆ డబ్బుల లెక్కలు చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి రైతు వరదలతో ఎకరానికి రూ.40 వేల నష్టపోయారని, పంటభూములు ఇసుక, రాళ్లతో నిండిపోయాయని పరిహారం త్వరగా అందించాలని అన్నారు. మత్తడిపోసి, చెరువు కట్టలు తెగిపోయి చేపపిల్లలతో నష్టపోయిన మత్స్యకారులకు చేపపిల్లలు అందించాలని, చెరువు గండ్లు యుద్ధప్రాతిపదికన పూడ్చాలని, పశు, మత్స్య సంపదకు పరిహారం అందించాలన్నారు. వరదలో ఆటోలు, జేసీబీలు, ట్రాక్టర్లు కొట్టుకుపోయి ఉపాధి కోల్పోయిన వారిని ఆదుకోవాలన్నారు. రోడ్లు పునరుద్ధరించి రవాణా సౌకర్యాం కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నేరుగా డబ్బులు ఇవ్వదని, నివేదికలు పంపితే కేంద్ర బృందాలు వచ్చి అంచనాలు తయారు చేసి పంపితే నిధులు ఇస్తారని తెలిపారు. అనంతరం రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్ ధర్మారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వరదల సమయంలో వ్యంగ్యాస్త్రాలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, నాయకులు సీతయ్య, మురళీ, శ్రీను, వెంకన్న, మధన్, సతీశ్, శశివర్ధన్, నాగమణి, రేష్మా, ఇందుభారతి, రవీందర్, చిరంజీవి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

హామీని నెరవేర్చాలి

మరిపెడ రూరల్: ఆకేరు వాగు ప్రవాహంలో చిక్కుకున్న సీతారాంతండాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి పరిశీలించి ప్రకటించిన రూ.10 వేలు నేటికీ బాధితులకు అందలేదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. వరద ముంపునకు గురైన మరిపెడ మండలం సీతారాంతండా బాధితులను శుక్రవారం రాజేందర్ పరామర్శించారు. ఎగువ ప్రాంతంలో ఉన్న 10 చెరువులు తెగిపోడంతో ఆకేరు వరద ముంచుకొచ్చి పురుషోత్తమాయగూడెం వద్ద రోడ్డు తెగిపోయిందన్నారు. కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఈటల వెంట ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు ఉన్నారు.

స్థిరమైన బయోటెక్నాలజీలో భారత్ అగ్రగామి

- సైంటిస్టు డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న సైంటిస్టు సుబ్బారెడ్డి



పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: స్థిరమైన బయోటెక్నాలజీలో భారతదేశం అగ్రగామిగా ఉందని హైదరాబాద్ సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింట్ డయాగ్నోస్టిక్ సైంటిస్టు డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం సెమినార్‌హాల్‌లో శుక్రవారం ఆవిభాగం అధిపతి ఆచార్య జి షమిత అధ్యక్షతన నిర్వహించిన 'బయోటెక్నాలజీ ఫర్ ఎకనామి ఎన్విరాన్మెంట్ అండ్ ఎంప్లాయ్‌మెంట్' అనే అంశంపై జరిగిన చర్చ కార్యక్రమంలో సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈరంగంలో భారతదేశం ప్రపంచానికే మార్గదర్శిగా ఉందన్నారు. మరో సైంటిస్టు డాక్టర్ యాతిశ్‌జే ఆచార్ మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ ఫర్ ఎకనామి ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ కేవలం స్థిరమైన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి మాత్రమే గాకుండా పర్యావరణ పరిరక్షణకు చాలా ఉపయోగకారి అని తెలిపారు. కార్యక్రమంలో జువాలజీ, బాటనీ, సెరీకల్చర్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ విద్యార్థులు పాల్గొన్నారు. పరిశోధనపరంగా ఉన్న అవకాశాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ప్రొఫెసర్ ఈసం నారాయణ, ఆచార్య ముస్తఫా, డాక్టర్ కనీజ్‌ఫాతిమా, డాక్టర్ లలితాకుమారి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- HNK, KITS College అంబాల రోడ్‌కు & ముచ్చర్ల రోడ్‌కు కొత్తగా వస్తున్న హైవే రోడ్‌కు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. సంప్ర॥ 9553255936. [W-1239961]
- మడికొండ చౌరస్తా దగ్గర నివాస గృహముల మధ్య 275 చ॥గ॥ FULL LRS కలిగిన EAST FACE Plot 32x75 అమ్మకమునకు గలదు. Contact 8247304448. [WA-7537]

TO-LET

- 3 BHK residence 2400 Sft. Semi Furnished as per Vastu, Lift & Generator, Car Parking available. for rent @ Reddy Colony near Vikas High School, HNK, 88869 96262. [M-12143]

SERVICES

OLD AGE HOME

- హన్మకొండ వడ్డెపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. దయచేసి సంప్రదించగలరు. 9848444020, 9110551507. [W-1239906]

FINANCE SERVICES

- సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్ట్‌గేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై & రిజిస్ట్రేషన్ చేయించి రుణాలు ఇప్పించబడును. సివిల్ ప్రాబ్లం ఉన్నా చేయించబడును. 9666142226. [W-1239958]

WANTED

- హరేకృష్ణ హోం కేర్: హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ:18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796272]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.